
ఆంధ్రజ్యోతి




శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.4 । కనిష్ఠం 24.1

కామారెడ్డి
జిల్లా వార్తలు

5

శనివారం 29 జూన్ 2024



భూముల విలువ పెంపుపై కసరత్తు!



» భూముల రిజిస్ట్రేషన్ విలువల సవరణ
» కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి బల్దియాలలో బ్లాక్‌ల వారీగా మార్పులు
» అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించనున్న అధికారులు
» ఆగస్టు నుంచి అమల్లోకి రిజిస్ట్రేషన్ నూతన చార్జీలు?
» పెరగనున్న భూముల రిజిస్ట్రేషన్ చార్జీలపై జోరుగా చర్చ
» ఆదాయం సమకూర్చుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు

కామారెడ్డి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ శాఖల ద్వారా ఆదాయం పెంచుకోవాలని భావిస్తున్న ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తం గా సాగు, సాగేతర భూముల మార్కెట్ విలువ పెంపునకు మొగ్గు చూపుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరుగ్యారెంటీల అమలులో భాగంగా రాబడి మార్గాలపై దృష్టిసారించింది. వాస్తవ విలువలకు, రిజిస్ట్రేషన్ విలువలకు భారీ వ్యత్యాసం ఉందనే అంశాన్ని దృష్టిలో ఉంచు కుని రాష్ట్రప్రభుత్వం రిజిస్ట్రేషన్ విలువలను పెంచే విషయంపై ఇప్పటికే తుది నిర్ణయం తీసుకుంది. వచ్చే ఆగస్టు నుంచి కొత్త మార్కెట్ విలువలను అమల్లోకి తెచ్చేందుకు కసరత్తు ప్రారంభించింది. గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు పర్యాయాలుగా మార్కెట్ విలువలు పెంచినప్పటి నుంచి జిల్లావ్యాప్తంగా రియల్ ఎస్టేట్ మార్కెట్ పడిపోగా తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రియల్ వ్యాపారానికి దెబ్బ తగలనుంది. ప్రభుత్వం 40 నుంచి 50 శాతానికి రిజిస్ట్రేషన్ విలువలను పెంచే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే భూముల విలువల సవరణ ప్రక్రియ ప్రారంభించింది. అనంతరం అధికారులు సవరించిన విలువలతో కూడిన నోటీసులను ప్రభుత్వానికి అందజేయనున్నారు. అనంతరం అభ్యంతరాలు స్వీకరణకు గడువు ఇచ్చిన ప్రభుత్వం ఆగస్టు నుంచి కొత్త మార్కెట్ విలువలను అమలులోకి తీసుకురానుంది.

కొనసాగుతున్న భూముల విలువల సవరణ ప్రక్రియ

గ్రామాలు, పట్టణాల్లో భూముల విలువల సవరణకు సంబంధించిన ప్రక్రియ ఇప్పటికే అధికారులు ప్రారంభించారు. గ్రామాలలో వ్యవసా యేతర భూములు, రహదారులకు ఆనుకుని ఉన్న గ్రామాలను గుర్తిం చి ఆయా గ్రామాల్లో భూముల విలువలను అధికారికంగా పెంచాలని భావిస్తున్నారు. గ్రామ పటాలను తీసుకుని ఇప్పటికే ఇంటి స్థలాలుగా మారిన సర్వేనంబర్‌లు, మరే యోగ్యత ఉన్న సర్వేనంబర్‌లు, జాతీయ, రాష్ట్ర రహదారులకు ఆనుకుని ఉన్న సర్వేనంబర్లను వేరువేరుగా గుర్తించనున్నారు. సబ్‌రిజిస్టర్, జిల్లా రిజిస్టర్ ఆయా గ్రామాలకు వెళ్లి సమాచారాన్ని సేకరించనున్నారు. ఆయా గ్రామాలలోని పెద్దలు, రెవెన్యూ, పంచాయతీ అధికారులతో మాట్లాడి ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో విలువలను సేకరించే విషయంలో తప్పులు జరగకుండా చూడాలని ఇప్పటికే అధికారులు ఆదేశాలు ఇచ్చారు. 5 నుంచి 6 కిలోమీటర్ల పరిధి లో గ్రామాలు ఉండే తేడాలను జాగ్రత్తగా గమనించాలని గ్రామంలో వేర్వేరు చోట్ల ఉన్న భూములు, ఆస్తులకు రెండు అంతకన్న ఎక్కువ విలువలను ప్రతిపాదించే అవకాశాన్ని కల్పించారు. వ్యవసాయ భూములవిషయంలో ప్రస్తుత బహిరంగ మార్కెట్ విలువలను రెవెన్యూ, పంచాయతీ అధికారుల నుంచి తీసుకోవాల్సి ఉంటుంది.

బల్దియాలో బ్లాక్‌ల వారీగా..

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ బల్దియాలలో బ్లాక్‌ల వారిగా భూముల విలువలను సవరించనున్నారు. మున్సిపాలిటీలలో అధికారికంగా నిర్ధారించిన ప్రాంతాల విలువలను సేకరించి నివాస, వాణిజ్య ప్రాంతాలకు వేరువేరుగా విలువ నిర్ధారించాల్సి ఉంటుంది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆస్తులకు ఒకే విలువ ప్రతిపాదించాల్సి ఉంది. మున్సిపాలిటీ డోర్ నంబర్ల వివరాలను ఫారం-2లో పొందుపరచాల్సి ఉంది. మున్సిపాలిటిలలో, విలీన గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులకు తగ్గటుగా విలువలను పరిగణలోకి తీసుకోవాల్సి ఉంది. బ్లాక్‌ల వారిగా విలువలను నిర్ధారించడంతో పాటు భవనాలకు ప్రత్యేకంగా గ్రౌండ్ ఫ్లోర్,ఇతర ఫ్లోర్‌లకు వేర్వేరు విలువలను నిర్ధారించే అంశాలను కేవలం ప్రధాన రహదారుల పక్కన ఉండేనివాస సముదాయాలకు వర్తింపచేయనున్నారు. ఇక కామారెడ్డిలో మాస్టర్‌ప్లాన్ ఆధారంగా విలువల సవరణకు ప్రతిపాదికంగా తీసుకోనున్నారు.

భారీగా పెరగనున్న భూముల విలువలు

జిల్లాలో భూముల విలువలు భారీగా పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే గజం భూమి కొనాలంటే వేలు వెచ్చించాల్సిన పరిస్థితి ఉంది. కామారెడ్డికి జాతీయ రహదారి ఆనుకుని ఉండడం, రైల్వే మార్గం ఉండడం, జిల్లా కేంద్రంగా మారడంతో ఇప్పటికే భూముల విలువలు మరింత పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం ప్రకారం జాతీయ, రాష్ట్ర రహదారులు ఉండడంతో వాటి వెంట ఉన్న భూములు మరింత పెరిగే అవకాశం ఉంది. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ పట్టణాలతో పాటు ప్రధానమండలాలు, జాతీయ రహదారి ఆనుకుని ఉండే ప్రాంతాల్లో భూముల విలువలు ఘననీయంగా పెరుగనున్నాయి. కామారెడ్డిలో భిక్కనూర్ నుంచి సదాశివనగర్ వరకు 44వ జాతీయ రహదారి, కామారెడ్డి డివిజన్‌లోని మాచారెడ్డి నుంచి ఎల్లారెడ్డి డివిజన్‌లోని ఎల్లారెడ్డి పట్టణ కేంద్రం వరకు కేకేవై జాతీయ రహదారి, జుక్కల్ ప్రాంతంలోని మద్నూర్ మండల కేంద్రం నుంచి నిజాంసాగర్ వరకు 161 వ జాతీయ రహదారి, నాగిరెడ్డిపేట నుంచి బాన్సువాడ వరకు ప్రస్తుతం కొనసాగుతున్న మరో జాతీయ రహదారి వెంబట భూముల విలువలు దాదాపు 40 శాతం వరకు పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం.

కుదేలు కానున్న రియల్ వ్యాపారం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013లో భూముల విలువలను సవరించగా దాదాపు ఏడేళ్ల అనంతరం కేసీఆర్ ప్రభుత్వం 2021లో భూరిజిస్ట్రేషన్ విలువలను పెంచింది. ఆ తర్వాత మూడు, నాలుగు నెలల వ్యవధిలోనే మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం భూముల విలువలను పెంచడంతో రియల్ వ్యాపారం ఒక్కసారిగా కుదేలు అయింది. 2022 నుంచి నేటి వరకు రియల్ వ్యాపారం ఆశించిన స్థాయిలో పెరిగిన దాఖలాలు లేవు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మరోసారి భూ రిజిస్ట్రేషన్ విలువలను పెంచనుండడంతో రియల్ వ్యాపారంపై ఈ ప్రభావం ఏ మేరకు పడుతుందోనని రియల్ వ్యాపారులు ప్రజలు చర్చించుకుంటున్నారు.

జిల్లా కేంద్రంలో మోస్తరు వర్షం

- సాయంత్రం వేళ కమ్ముకున్న మేఘాలు
- చల్లబడిన వాతావరణం
- వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్న రైతులు



జిల్లాకేంద్రంలో కురుస్తున్న వర్షం

కామారెడ్డిటౌన్, జూన్ 28: జిల్లాకేంద్రంలో శుక్రవారం సాయంత్రం ఓ మోస్తారు వర్షం కురిసింది. కామారెడ్డితోపాటు గత కొద్దిరోజుల నుంచి ఆయా మండలాల్లో వర్షం కురియడంతో వ్యవసాయపనులు ఉపందుకోనున్నాయి. రైతులకు ఈ వర్షంఎంతో ఊరటను ఇచ్చినట్లయింది. వర్షంతో ఆయా ప్రాంతాలు చిత్తడిగా మారాయి. ఎప్పటిలాగా మున్సిపల్, గ్రామపంచాయతీ అధికారులు పలుచోట్ల పరిశుభ్రపనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మురికినీరు రోడ్లపై పారడం, రోడ్లపై మడుగులు కట్టడం జరిగింది. ప్రతిసారి పట్టణ,పల్లె ప్రగతి పనులు చేపట్టిన ఈ సంవత్సరం వాటి దాఖలాలు ఏమి లేవని దీంతో మురికివాసనతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. వర్షాలు ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు రాకుండా అధికారులు తగిన చర్యలుతీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వరుణుడిపైనే ఆశలు

వడగండ్ల, అకాలవర్షాలకు నష్టపోయిన రైతులు ఈ పంటతో అయినా తాము కష్టాల నుంచి గట్టెక్కాలని వరుణుడిపైనే ఆశలు పెట్టుకున్నారు. వానకాలం సీజన్‌లో అధిక లాభాలు ఇచ్చే పంటలను పండించి యాసంగి పంటలకు చేసిన అప్పులను తీర్చేందుకు ప్రణాళికలు రచించుకున్నారు. వరుణుడు కరుణించాలని వేడుకుంటున్నారు.

నేడు భిక్కనూరులో తైబజార్ వేలం

భిక్కనూరు: పట్టణానికి చెందిన తైబజార్ వేలం కార్యక్రమాన్ని శనివారం జీపీ కార్యాలయం ఆవరణలో ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందని గ్రామ పంచాయతీ ఈవో మహేష్‌గౌడ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని

కలెక్టరేట్ ఎదుట ఆందోళన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు, విద్యార్థులు

కామారెడ్డి టౌన్, జూన్ 28: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కామారెడ్డి కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏబీవీపీ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఈవో వచ్చి విద్యా సమస్యలను పరిష్కరించేవరకు లేచేది లేదని భీష్మించి కూర్చున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీ పెరిగిపోయిందని విద్యా హక్కు చట్టం అమలు ఎక్కడా కనిపించడం లేదని అన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వం ఎన్ని జీవోలు ఇచ్చినా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని అన్నారు.ఫీజుల నియంత్రణచట్టం అమలు తదితర అంశాలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తక్షణమే తగు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న నిజామాబాద్ డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్

విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- నిజామాబాద్ డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ రాజు


సదాశివనగర్, జూన్ 28: విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని నిజామాబాద్ డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్స్‌పెక్టర్ అంతటి రాజు సూచించారు. మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి వద్ద గల గాయత్రి షుగర్‌ఫ్యాక్టరిలో జాతీయభద్రత వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజు హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం చాలా పెరిగిందని అన్నారు. ఎలక్ట్రికల్ వెహికల్స్, చార్జింగ్ స్టేషన్‌లు మొదలైన అనువర్తనాలలో విద్యుత్‌ను ఉపయోగిస్తున్నారని, దీంతో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయని అన్నారు. విద్యుత్ వినియోగదారులకు జాగ్రత్తలు తెలియకపోవడం వల్లే ఈ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. కొన్నిసార్లు విద్యుత్‌షాక్‌కు గురైన వ్యక్తిని రక్షించడానికి స్పాట్‌లో ఉన్న ఇతరులు షాక్‌కు గురైనవ్యక్తిని స్విచ్ ఆఫ్‌చేయకుండా నేరుగా పట్టుకుంటున్నారని, ఇది ప్రమాదాలకు దారితీస్తోందని అన్నారు. షాక్ గురైన వ్యక్తులను ఎల్లప్పుడు పొడికర్రలు లేదా మరేదైన ఇన్సులేటెడ్ వస్తువులతో ప్రమాదాన్ని ఆపవచ్చని అన్నారు. ఆర్‌సీబీ, ఆర్‌సీబీఓలు అన్ని సాకెట్ అవుట్‌లేట్‌లు, లైటింగ్ సర్క్యూట్‌ల కోరకు ఉపయోగించాలని అన్నారు. ప్రామాణిక వైర్లు, పరికరాలు మాత్రమే ఉపయోగించాలని పాడైపోయిన వైర్లు, కేబుల్‌లు వెంటనే రిప్లేస్ చేయాలని అన్నారు. ప్రమాదాలను నివారించడానికి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రోసిజర్స్‌ని ఖచ్చితంగా పాటించాలని అన్నారు. కార్యక్రమంలో జీఎం డి.వీర్రాజు, ఇంజనీరింగ్ డీఎం కుటుంబరావు, తదితరులు పాల్గొన్నారు.



చినుకుపై చింత!

- దుక్కిని సిద్ధం చేసుకున్న రైతులు
- నిజాంసాగర్‌లో నాలుగు టీఎంసీల నీరు
- సాగు కోసం ప్రధాన కాల్వ ద్వారా నీటి విడుదల
- బోరు బావుల వద్ద జోరుగా నాట్లు

ప్రధాన కాల్వ ద్వారా విడుదలవుతున్న నీరు



నిజాంసాగర్, జూన్ 28: వర్షాకాలం ప్రారంభమై 21 రోజులు గడిచినా వరుణుడు కరుణించడం లేదు. వర్షం కురవాలని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న రైతాంగం చినుపై చింత పెట్టుకుంది. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా రైతులు దుక్కిని దున్ని వరి నాట్లు సిద్ధం చేశారు. భారీ వర్షాలు కురిస్తే నాన్ కమాండ్, కమాండ్ ఏరియాలో వరినాట్లు జోరుగా సాగనున్నాయి. ఈనెల 25వ తేది నాటికి సాగర్‌లో 4.175 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉభయ జిల్లాల వర ప్రదాయిని సాగర్ కింద ఈ యేడాది లక్షా 15 వేల 800 ఎకరాలకు సాగునీరు అందించేందుకు లక్ష్యం కాగా, ఈ ఏడాది నిజాంసాగర్ అతి తక్కువగా నీళ్ల ఉండగా, కేవలం సాగర్ నుంచి 2 విడతలు నీరు అందించేందుకు నీటి పారుదల శాఖ ప్రణాళిక సిద్ధం చేశారు. మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన మరునాడే నీటిని విడుదల చేశారు. ఇప్పటివరకు 03.98 టీఎంసీల నీటిని ఆయకట్టు రైతాంగానికి విడుదల చేశారు. ఈ ఏడాది వర్షాలు కురిస్తే తప్ప సాగర్‌లోకి నీరు వచ్చే అవకాశం లేదు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సింగూరులో నీరున్నా సాగర్‌కు నీరువిడుదల చేసేనా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతుల భవితవ్యం సాగర్ పై ఆధారపడి ఉంది. లక్షా 15 వేల ఎకరాలకు గత యేడాది పంటలకు విడుదల చేయగా, యాసంగి ముగిసే వరకు ప్రాజెక్టులో 4.176 టీఎంసీల నీటి నిల్వలు ఉండగా, ఈ యేడాది సాగర్ ఆయకట్టు కమాండ్ ఏరియాలో డిస్ట్రిబ్యూటర్ 1 నుంచి 49 వరకు వరి నారు మళ్ల ఏపుగా పెరుగడంతో ఈనెల 25వ తేది నుంచి నీరు విడుదల చేయడంతో బాన్సువాడ, బోధన్ వరకు వరినాట్లు వేస్తున్నారు. నాన్ కమాండ్ ఏరియా మంజీరా పరివాహక ప్రాంతంలో వరి నాట్లు వేస్తున్నారు. వర్షాలు పుష్కలంగాకురిస్తే గేట్లు ఎత్తివేస్తే తప్ప నాన్ కమాండ్ ఏరియా రైతులు గట్టెక్కే పరిస్థితి లేదు. సింగీతం, కళ్యాణి, నల్లవారు మత్తడి పొంగితే తప్ప మంజీరాలోనీరు వచ్చే అవకాశం ఉండదు. ఈ ఏడాది వర్షాకాలంలో ఉన్న నాలుగు టీఎంసీల నీటిని రెండు విడతలుగా విడుదల చేస్తే 1.5 టీఎంసీ నిజాంసాగర్‌లో నిల్వ ఉంటాయి. సాగర్‌ను నమ్ముకున్న రైతాంగానికి వర్షాలు కురిస్తే తప్ప నీటిని విడుదల చేసే అవకాశం ఉండదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం కొండ పోచమ్మ, సింగూరు ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేసేందుకు చర్యలు చేపట్టేనా అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

బోరు బావుల వద్ద జోరుగా వరి నాట్లు

కమాండ్, నాన్ కమాండ్ వద్ద బోరు బావుల వద్ద ఇప్పటికే వరి నాట్లు వేస్తున్నారు. రైతులకు కరెంట్ కష్టాలు తప్పడం లేదు. అడపా దడపా వర్షాలు కురిస్తే వరినాట్లు జోరుగా వేయనున్నారు. బోరు బావుల కింద రైతులు జీలుగ వేసి, దుక్కులు దున్నగా, వర్షాలు లేక రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. రైతాంగం వరుణుడి కోసం ఎదురు చూస్తున్నారు. వరుణుడు కరుణిస్తే తమ కష్టాలు గట్టెక్కుతాయని గంపెడాశతో ఉంది.

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యం

● కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి


కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న మానాల మోహన్ రెడ్డి

కమ్మర్‌పల్లి, జూన్ 28: ఎన్నికలప్పుడు రాష్ట్ర ప్రజలు, రైతులకు ఇచ్చిన హామీలను తూచాతప్పకుండా అమలు చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం కమ్మర్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో అమలు కాని హామీలిచ్చిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పదేళ్ల కాలంలో ఏ మేరకు అమలుచేశారో వెనక్కి తిరిగి చూసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల అమలుకు ఎన్నికల కోడ్ అడ్డురావడంతో జాప్యం జరిగిందన్నారు. ఆరు గ్యారంటీలలో మహిళలకు ఉచిత బస్సు, 2వంద యూనిట్ల ఉచిత విద్యుత్, ఐదువందలకే గ్యాస్ సిలిండర్ పథకాలు అమలవుతున్నాయన్నారు. ఈ విషయాలు తెలిసికూడా ప్రతిపక్ష పార్టీలు గగ్గోలుపెట్టడంలో అర్థం లేదన్నారు. వరంగల్ డిక్లరేషన్ ప్రకారం రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఆగస్టు 15 వరకు అమలవుతుందని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేస్తూ రుణమాఫీ ప్రణాళికలను అధికారులు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పేద కుటుంబాలకు 15 లక్షలు ఏడాదికి కోటి ఉద్యోగాలు ఎటు పోయాయని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తామన్న డబుల్‌బెడ్‌రూమ్‌లు, దళితులకు మూడు ఎకరాలు, ఇంటికో ఉద్యోగం ఎటుపోయాయని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ హామీలు అమలు చేయకపోతే దీక్ష చేస్తానని ప్రకటించిన ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ముందుగా కేంద్రంలో ఉన్న నరేంద్ర మోదీని ప్రశ్నించాలన్నారు. దేశ సంపద అందరికీ సంబంధించింది కేవలం గుజరాత్ రాష్ట్రానికి మాత్రమే సంబంధించింది కాదన్న విషయాన్ని మోదీకి గుర్తుచేయాలన్నారు. రాకేష్‌రెడ్డి తన స్థాయికి మించి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్నాడన్నారు. వ్యక్తిగత ఏజెండాతో పనిచేస్తానని ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలకు చెప్పి ఎమ్మెల్యేగా గెలిచిన రాకేష్ రెడ్డి ఆరునెలలు దాటినా ఎందుకు అభివృద్ధి చేయడం లేదని ప్రశ్నించారు. ఆచితూచి మట్లాడాలని హితవు పలికారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, జిల్లా నాయకులు తిప్పిరెడ్డి శ్రీనివాస్, బోనగిరి భాస్కర్, జిల్లా ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్, రాజేంద్ర ప్రసాద్, కో-ఆప్షన్ సభ్యుడు పాష, మాజీసర్పంచ్ బద్దం రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయండి

● ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన చేపూర్ వీడీసీ సభ్యులు

ఆర్మూర్‌రూరల్, జూన్28: ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో గత కొన్ని రోజుల క్రితం అక్రమంగా చేసిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని శుక్రవారం ఆర్డీవో రాజాగౌడ్‌కు చేపూర్ వీడీసీసభ్యులు, గ్రామస్థులు వినతి పత్రం అందజేశారు. చేపూర్ గ్రామశివారులో సారంగి పెద్ద సాయన్న, విజయ్‌లు గతంలో రెవెన్యూ అధికారులతో కలిసి కుమ్మక్కై స్మశాన వాటిక భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారన్నారు. ఈ భూమి విషయమై గతంలో కోర్టు స్మశానవాటిక, జంబి భూమిగా చెందినదే అని తీర్పు ఇచ్చిందన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని వీడీసీసభ్యులు, గ్రామ ప్రజలు 25ఏళ్ల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. రెండేళ్ల క్రితం ప్రభుత్వం కెనాల్ స్థలంలో వైకుంఠ ధామం నిర్మించిదని, ఆ ప్రదేశంలో ప్రభుత్వం మంజూరు చేసిన బోరు, మోటర్‌ను ధ్వంసం చేసి బోరు రంధ్రాన్ని మూసివేశారని వారు ఆరోపించారు. అక్రమ రిజిస్టేషన్ చేయించుకున్న స్మశాన వాటిక భూమిని, జంబి భూమిని జిల్లా కలెక్టర్ విచారణ జరిపి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని వారు కోరారు. అనంతరం ఏసీపీ బస్వారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ ఇందూర్ సాయన్న, మాజీఎంపీటీసీ జన్నెపల్లి గంగాధర్, వీడీసీ అధ్యక్షుడు మెడిపల్లి శ్రీకాంత్, కోశాధికారి రుక్మజీ, శాంతికుమార్, చరణ్, రాజు, దాసరి శ్రీకంత్, నర్సారెడ్డి, సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో చిరుతపులి కలకలం

కోటగిరి, జూన్ 28 : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున చిరుతపులి కలకలం సృష్టించింది. అటవీ ప్రాంతం నుంచి వచ్చిన చిరుత కొత్తపల్లి మాజీవిండో అధ్యక్షులు సుధీర్ ఇంట్లో కుక్కపై దాడి చేసింది. కుక్క అరుపులు విన్న యజమాని కిటికి తలుపులు తెరిచి చూడగా కుక్కపై చిరుతదాడి చేయడాన్ని గమనించాడు. పెద్దగా అరుపులు వేయడంతో చిరుత పారిపోయింది. ఈ విషయమై అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. బీట్‌ఆఫీసర్ అరుణ్‌కుమార్ ఘటనాస్థలాన్ని సందర్శించారు. చిరుత పాదముద్రలను సేకరించారు. చిరుత ఏడాదిలోపు వయసు ఉన్నట్లు నిర్ధారించారు. గతంలోనూ కొత్తపల్లి గ్రామంలో పలుమార్లు చిరుతపులి సంచరించి కలకలం సృష్టించింది. ప్రస్తుతం నిజాంసాగర్ కాలువ రావడంతో చిరుత అటవీ ప్రాంతంలోకి వెళ్లే పరిస్థితి లేక ఇటు వైపు వచ్చినట్లు అటవీశాఖ అధికారులు భావించారు. చిరుత సంచారంపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మరోమారు ఇటు వైపు వస్తే బోను ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రతీరోజు ధ్యానం చేయాలి : జడ్పీచైర్మన్

ఆర్మూర్‌రూరల్, జూన్ 28: ప్రతీ రోజు తప్పనిసరిగా ధ్యానం చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. శుక్రవారం ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లోని శ్రావణ్ గార్డెన్‌లో శ్రీ నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రం, పీఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో ధ్యాన మహాయజ్ఞ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన దాదన్నగారి విఠల్ రావు జ్యోతిప్రజ్వాలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు ధ్యాన, ఆత్మజ్ఞాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతీరోజు కార్యక్రమంలో పాల్గొని ధ్యానాన్ని, ఆత్మజ్ఞానాన్ని అందు కోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఎంసీ మేనేజింగ్ ట్రస్ట్ సేతు బాలకృష్ణ, సాయికృష్ణరెడ్డి, తిరుమల గంగారాం, పల్లె గంగారెడ్డి, శ్రీనివాస్, మిట్టపల్లి గంగారెడ్డి, దయానంద్ పాల్గొన్నారు.

క్షయ నివారణ టీకాలపై సిబ్బందికి శిక్షణ

కమ్మర్‌పల్లి, జూన్ 28: మండలంలోని చౌట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బందికి శుక్రవారం బీసీజీ (క్షయనివారణ) టీకాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ సంతోష్ మాట్లాడుతూ ఇదివరకు చిన్నపిల్లలకు మాత్రమే ఈ టీకాలు ఇచ్చేవారమని, 2025 వరకు టీబీని సమూలంగా నిర్మూలించడమే లక్ష్యంగా పెద్దలకు సైతం ఇవ్వడానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయని. ఈ ప్రక్రియ ఆగస్టు నెలలో ప్రారంభమవుతుందన్నారు. ముందుగా క్షయ వ్యాధిగ్రస్తుల ఇండ్లలో ఉంటున్న వారికి , 60 సంవత్సరాలు పైబడిన వారికి, పొగతాగేవారికి, డయాబెటిస్ ఉన్నవారికి , పోషకాహారలోపం ఉన్నవారికి ఈ వ్యాక్సిన్ అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చౌట్‌పల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుప్రియ, హెచ్ఈవో సత్యనారాయణ, జిల్లా కో-ఆర్డినేటర్ వరిగౌడ్ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విద్య

బోధన్‌రూరల్, జూన్28: ప్రజలు తమ ఇళ్లతో పాటు ఇంటి పరిసరాలను సైతం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడ నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విద్య అన్నారు. శుక్రవారం డ్రై డే, ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆచన్‌పల్లి తదితర వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇళ్లలోకి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి ప్రాంగణాల్లో టైర్‌లలో నీరు, చెడిపోయిన కూలర్‌లలో నీరు, అలాగే వర్షపు నీరు ఆగకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటినిల్వల వల్లనే దోమలు అభివృద్ధి చెందుతాయని, దీని వల్ల ప్రజలు అనారోగ్యాల పాలవుతారని పేర్కొన్నారు. ప్రజలు తమ ఆరోగ్య సంరక్షణకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మాక్లూర్, జూన్28 : మదన్‌పల్లి తండాకు చెందిన ప్రకాష్ అనే వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుని తండ్రి మెగావత్ లింబా ఈనెల 8వ తేదీన తన కుమారుడు అదృశ్యమైనట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో మృతుని గురించి ఆరాతీయగా అమ్రాద్ అటవీ ప్రాంతంలో బైక్ కనిపించడంతో చుట్టుపక్కల వెతకగా కుళ్ళిన ప్రకాష్ మృతదేహం కనిపించింది. ప్రకాష్ మానసిక స్థితి బాగోలేక చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు.

విద్యార్థులకు మెడల్స్, నగదు పురస్కారం

కమ్మర్‌పల్లి, జూన్ 28: మండలంలోని కోనసముందర్ ఉన్నత పాఠశాలలో గత విద్యాసంవత్సరం ఉత్తమ మార్కులు సాధించిన పదోతరగతి విద్యార్థులకు గ్రామంలోని అమ్మఒడి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ప్రతీ ఏటా విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మెడల్స్, మెమోంటోలు, ప్రశంసాపత్రాలు అందజేసి శాలువాలతో సత్కరించి నగదు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.మధుపాల్, ఉపాధ్యాయులు, అమ్మఒడి సంస్థ గౌరవ అధ్యక్షులు అవుసుల సాగర్, అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, సలహాదారులు కుమ్మరి శ్రీకాంత్, వీడీసీ సభ్యులు ఉన్నారు.

కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

జక్రాన్‌పల్లి, జూన్28: మండలంలోని అర్గుల్ గ్రామంలో శుక్రవారం పిచ్చికుక్కలు దాడిచేయగా ముగ్గురికి తీవ్రగాయాలు అయినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో ప్రజలు నడుచుకుంటూ వెళ్తుండగా పిచ్చికుక్కలు వెనుక నుంచి వచ్చి దాడి చేస్తున్నాయని గ్రామ స్థులు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి పిచ్చి కుక్కల బెడద నుంచి రక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

26వ వార్డులో ఫ్రైడే - డ్రైడే కార్యక్రమం

ఆర్మూర్‌టౌన్, జూన్ 28: మున్సిపల్ పరిధిలోని 26వార్డులోని రాజారాంనగర్ కాలనీలో యుపీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. తమ ఇంటి పరిసరాలను శుభ్రం ఉంచుకోవాలని, నీటి నిల్వ లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం డ్రైనేజీలలో యాంటిలార్వ స్ప్రెను చల్లించారు. నీటి నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఆయిల్‌బాల్స్‌లను వేశారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ఎస్ఆర్.సుజాత, మున్సిపల్ కమిషనర్ రాజు, సానిటరీ ఇన్స్‌పెక్టార్ మహేష్, పూర్ణమౌళి, ఆనంద్, మెప్మా సీవో రాజలింగం, ఆర్‌పీ సమత పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న
మూడు ఇసుక టిప్పర్ల పట్టివేత

రెంజల్, జూన్ 28: మండల కేంద్రంలోని సాటాపూర్ నుంచి రెంజల్‌వైపు అక్రమంగా తరలిస్తున్న మూడుఇసుక టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు. శుక్రవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో సాటాపూర్ నుంచి నిజామాబాద్ వైపువెళ్తున్న ఇసుక టిప్పర్లను తన సిబ్బందితో కలిసి స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

ఎడపల్లి: మండలంలోని సాటాపూర్ గేటు వద్ద మూడుఇసుక టిప్పర్‌లను పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా మూడు టిప్పర్‌లలో ఇసుక తరలించడంతో వాటిని పట్టుకుని పరిశీలించి స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు దుస్తులు, పుస్తకాల పంపిణీ

ఆర్మూర్‌రూరల్, జూన్ 28: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఏకరూప దుస్తులు, నోట్‌పుస్తకాలను మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని, ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్‌మున్నా, వార్డు కౌన్సిలర్ జహీర్, టిక్కి శంకర్, వీడీసీ అధ్యక్షుడు దేవేందర్, సత్యం, ఐసీడీఎస్ అధ్య క్షురాలు తార, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పర్వీన్ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న కలెక్టర్

ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలి: కలెక్టర్

కామారెడ్డిటౌన్, జూన్ 28: ఉద్యోగులు అంకితభావంతో పని చేసి ప్రజల మన్ననలు పొందాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. శుక్రవారం జిల్లా అధికారుల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఆత్మీయ పదవి విరమణ సన్మాన సభ నిర్వహించారు. పదవి విరమణ పొందుతున్న డీపీఆర్వో శాంతికుమార్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి సింహారావు దంపతులను కలెక్టర్ సన్మానించారు. పదవి విరమణ పొందిన ఉద్యోగులు సమాజ సేవలో భాగస్వామ్యులు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి,జిల్లా అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజారాం, ప్రతినిధులు దయానంద్, సతీష్‌కుమార్, భాగ్యలక్ష్మీ, రమ్య, టీఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్యదర్శి సాయిలు, జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవేందర్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బీర్కూర్, జూన్ 28: ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలు అవగాహన కల్పించారు. బీర్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఆరోగ్య సిబ్బంది ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టారు. వివిధ పాత్రలలో నిలిచిన వర్షపు నీటిని తొలగించారు. ఇంటిని, ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. నిల్వ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని, నీటిపాత్రలను శుభ్రంగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి ఎల్‌వోసీ చెక్కు అందజేత

భిక్కనూరు, జూన్28: మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామానికి చెందిన మందుగుల మంజులకు చికిత్స నిమిత్తం శుక్రవారం పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, ఎంపీపీ గాల్‌రెడ్డి ఎల్‌వోసీ చెక్కు అందజేశారు. మంజుల కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతుందని, నిరుపేద కుటుంబం కావడంతో శస్త్రచికిత్స నిమిత్తం మంజులకు రూ.2.50లక్షల ఎల్‌వోసీని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మీనాబాబు, నాయకులు నర్సింహారెడ్డి, సిద్దరాములు, తుడుం స్వామి, సుదర్శన్, జీవన్, ఎల్లం, చందు, బాబు, భిక్షపతి, రాజు, కిరణ్, ప్రేమ్, శ్రీకాంత్, సత్యనారాయణ, రాందాసు, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో పీవీ నరసింహారావు జయంతి

బీర్కూర్, జూన్ 28: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి వేడుకలను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పీవీ విప్లవాత్మక సంస్కరణలు, సాహసోపేత నిర్ణయాలతో భారతదేశం బలమైన ఆర్థికశక్తిగా ఎదిగేందుకు పునాదులు వేశారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

'వ్యవసాయ కూలీల కోసం సమగ్ర చట్టం తేవాలి'

లింగంపేట, జూన్ 28: వ్యవసాయ కూలీలకు సమగ్రమైన చట్టం తేవాలని (ఏఐపీకేఎస్) అఖిల భారత ప్రగతి శీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు పరమేష్ మాట్లాడుతూ దేశంలో ఈనాటి లెక్కల ప్రకారం 59శాతం మంది వ్యవసాయ రంగంలో పని చేస్తున్నారని 14కోట్ల మంది వ్యవసాయ కార్మికులే ఉన్నారని ఆయన తెలిపారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణతో ఉపాధి కోల్పోయారని తెలిపారు. వ్యావసాయ కూలీలను ప్రత్యేక వర్గంగా గుర్తించి వారి సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజ్, అంబన్న, లక్ష్మినారాయణ, సాయిలు, పెంటయ్య, వెంకటి, సంగయ్యలతో పాటు నాయకులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామారెడ్డి, జూన్28: మండలంలోని ఉప్పల్‌వాయి గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 12లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.

ముత్తడి వాగును పరిశీలించి మున్సిపల్ చైర్‌పర్సన్

కామారెడ్డి టౌన్, జూన్28: పట్టణంలోని జీఆర్ కాలనీ ముత్తడి వాగును శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముత్తడి వాగు నుంచి మురికి నీరు వస్తుండడంతో జీఆర్ కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీంతో వాగు వద్ద ఉన్న పిచ్చి మొక్కలు, రాళ్లు తొలగించినట్లు తెలిపారు. ఈ పనులను వేగవంతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, వార్డు కౌన్సిలర్ పంబరి లత, తదతరులు ఉన్నారు.



అధికారులకు పలు సూచనలు చేస్తున్న ఇందుప్రియ

ప్రతి వాహనానికి

నెంబర్ ప్లేట్ ఉండాల్సిందే

- చలాన్లు తప్పించుకునేందుకు వాహనదారుల వింత ప్రయోగాలు
- రూల్స్‌ను బేఖాతరు చేస్తున్న వాహనదారులు
- తీవ్ర పరిణామాలు తప్పవంటున్న పోలీసులు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు (ఫైల్)

భిక్కనూరు, జూన్ 28: మనం ఏ వాహనం కొన్నా.. చట్టప్రకారం దానికి రిజిస్ట్రేషన్ తప్పనిసరి. దానిప్రకారం రవాణాశాఖ అధికారులు ఆ వాహనానికి ఓ నెంబరును కేటాయిస్తారు. ఆ నెంబరును తప్పకుండా స్పష్టంగా కనిపించేలా నెంబర్ ప్లేట్‌పై రాయించుకుని వాహనానికి వెనుక, ముందు భాగంలో బిగించుకోవాలి. ఈ నెంబర్ ఆధారంగా ఈ వాహనం ఎవరిది.. ఇతర అన్ని విషయాలూ అన్ని తెలుసుకోవచ్చు. ఈ విషయం అందరికీ తెలిసినా ద్విచక్ర, మూడు, నాలుగు చక్రాల వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా పోలీసులు వేసే చలాన్లను తప్పించుకోవడానికి కొందరు వాహనదారులు వింత ప్రయోగాలు చేస్తున్నారు. వాహనాలకు నెంబర్‌ప్లేట్‌లను తొలగించడం, చివరి రెండు అక్షరాలను తొలగించడం, నెంబర్‌ప్లేట్‌ను వాహనం నెంబర్ కన్పించకుండా వంచడం లాంటి పిచ్చిచేష్టలు చేస్తున్నవారితో పోలీసులకు తలనొప్పిగా మారింది. దీంతో వాహనానికి నెంబర్‌ప్లేట్ లేకుండా నడిపే వారిని జిల్లా పోలీసులు స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమాలను నిర్వహించి గుర్తిస్తూ భారీగా జరిమానాలు విధిస్తున్నారు. వాహనానికి నెంబర్ ప్లేట్ లేకపోతే జరిగే నష్టాల పట్ల వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు.

● ట్రాఫిక్ రూల్స్‌ను బేఖాతరు చేస్తున్న వాహనదారులు

ఇటీవల చాలామంది వాహనదారులు ట్రాఫిక్ రూల్స్‌ను బేఖాతరు చేస్తున్నారు. వాహనాలను ఇష్టమొచ్చినట్లు నడపటంతోపాటుగా మైనర్లకు వాహనాలు ఇవ్వడం, వెంట లైసెన్స్, ఆర్సీ, ఇతర పేపర్లను పెట్టుకోకపోవడం, హెల్మెట్లను వాడకపోవడం, మితిమీరిన వేగంతో వెళ్లడం, సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం లాంటివి చేస్తూవారు ప్రమాదానికి గురవుతూ ఇతరులను ప్రమాదంలోకి నెట్టివేస్తున్నారు. ముఖ్యంగా చాలామంది ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనదారులు పోలీసులు, రవాణాశాఖ అధికారులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టినా, జరిమానాలు విధిస్తున్నా హెల్మెట్‌లను, సీట్ బెల్ట్‌ను ఉపయోగించడం లేదు. ఇటీవల జరిగిన ప్రమాదాలలో ఎక్కువగా హెల్మెట్, సీట్‌బెల్టు ధరించని వారే ప్రాణాలు కోల్పోతున్నారు. పోలీసులు ఎంత మొత్తుకుంటున్నా వాహనదారుల్లో మాత్రం ఎలాంటి మార్పు రావడం లేదు.

● చలాన్లు తప్పించుకునేందుకే వింత ప్రయోగాలు

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా పోలీసులు విధించే చలాన్లను తప్పించుకోవడానికి కొందరు వాహనదారులు వింత ప్రయోగాలు చేస్తున్నారు. కొందరు ఏకంగా వాహన నెంబర్ ప్లేట్‌ను తీసేయడం, మరి కొందరు వాహననెంబర్ కన్పించకుండా నెంబర్‌పై స్టిక్కర్లను అతికించడం, చివరిరెండు నెంబర్‌లను తొలగించడం, నెంబర్ ప్లేట్‌ను వంచడం లాంటివి చేస్తున్నారు. కొందరు మహిళలైతే నెంబర్ కన్పించకుండా చున్నీ, డ్రెస్‌ను అడ్డు పెట్టి పోలీసుల చలాన్లను తప్పించుకుంటున్నారు.

● పోలీసుల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు

నెంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్న వాహనాలను పట్టుకోవడానికి పోలీసులు స్పెషల్‌డ్రైవ్‌లు నిర్వహిస్తూ ఆకతాయిల ఆట కట్టిస్తున్నారు. నెంబర్ ప్లేట్ లేని, నెంబర్ కన్పించకుండా స్టిక్కర్లు అతికించడం, చివరి నెంబర్లను తొలగించిన వాహనాలను పట్టుకుని సీజ్‌చేసి స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలిస్తున్నారు. సదరు వాహనదారులను పోలీసుస్టేషన్‌కు పిలిపించి జరిమానాలు విధించడంతోపాటు నెంబర్ ప్లేట్ లేకపోతే జరిగే నష్టాల గురించి అవగాహన కల్పించి పట్టుకున్న ప్రతీ వాహనానికి వాహన యాజమాని నెంబర్ ప్లేట్ బిగించిన తర్వాతనే వాహనాన్ని వదులుతున్నారు.

ప్రతీ వాహనానికి నెంబర్‌ప్లేట్ తప్పనిసరి

● సంపత్‌కుమార్, సీఐ భిక్కనూరు

ప్రతీ వాహనానికి నెంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలి. చలాన్లను తప్పించుకోవడానికి కొందరు వాహనదారులు వాహన నెంబర్ ప్లేట్‌ను తొలగిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి 30 నెంబర్ ప్లేట్ లేని, సరిగా లేని వాహనాలను సీజ్ చేశాం. ప్రతీ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాల్సిందే. ముఖ్యంగా ద్విచక్ర వాహదారులు హెల్మెట్ ఉపయోగించాలి.

జాతీయ బంజారా సమ్మేళన సదస్సును

విజయవంతం చేయండి

● ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు నరేశ్ రాథోడ్

బాన్సువాడ టౌన్, జూన్ 28: లంబాడి హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూలై 1న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించబోయే జాతీయ బంజారా సమ్మేళన సదస్సును విజయవంతం చేయాలని ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్‌రాథోడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ లంబాడి హక్కుల పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బెల్లయ్యనాయక్ ఆధ్వర్యంలో మా తండాలో మా రాజ్యం, మేము ఎంత ఉన్నామో మాకు అంత వాటా అనే నినాదంతో 1997 జూలై 1న లంబాడి హక్కుల పోరాట సమితి సంఘం ఏర్పాటు చేశారన్నారు. సంఘం ఏర్పడి దాదాపు 28 సంవత్సరాలు పూర్తి అయినట్లు తెలిపారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్నటువంటి వివిధ బంజారా జాతిసంఘాల ప్రతినిధులతో హైదరాబాద్ నగరంలో జాతీయ బంజారా సమ్మేళనం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి లంబాడి మేధావులు, పెద్దలు, విద్యార్థులు అధిక సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో చంద్రనాయక్, రవిచవాన్, సురేష్‌కుమార్, అశోక్ ఉన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

లింగంపేట, జూన్ 28: మండల కేంద్రంలోని భీంరాజ్ ఆసుపత్రి వద్ద ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించిందని జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షుడు రాజన్న అన్నారు. మొత్తం 110మందికి వైద్యపరీక్షలు నిర్వహించామని 18మందికి ఈజీసీ గుండె పరీక్షలు, 35మందికి షుగర్ పరీక్షలు, 16మందికి కంటి పరీక్షలు, 50మందికి ఇతర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైద్యుడు విక్రమ్, డివిజన్ అధ్యక్షుడు రవిగౌడ్, నాగారాజ్‌గౌడ్, నరసింహం, భీంరాజ్, వైద్యసిబ్బంది పద్మ, పుష్ప సందీప్, సాయిలు, శ్రీకాంత్, బాలు, వైద్యసిబ్బంది ఉన్నారు.

మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నసురుల్లాబాద్, జూన్ 28: నసురుల్లాబాద్ మం డలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చేరి మైస మ్మ ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మ వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం కొచ్చేరి మైసమ్మ తల్లి అని అన్నారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహాపంక్తి భోజనాలు చేశారు. ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

న్యాయాధికారిని మర్యాదపూర్వకంగా

కలిసిన కలెక్టర్



జడ్జికి పూలమొక్క అందిస్తున్న కలెక్టర్

కామారెడ్డి రూరల్, జూన్ 28 : కామారెడ్డి జిల్లా కోర్టు జడ్జి వరప్ర సాద్‌ను కామారెడ్డి జిల్లా కు నూతనంగా వచ్చిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం మర్యా దపూర్వకంగా కలిశారు. జడ్జి వరప్రసాద్‌కు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పూల మొక్కను అంద జేశారు. ఈ సం దర్భంగా పలు న్యాయ అంశాలపై ఇరువురు ముచ్చటించారు.

ఊరడమ్మ ఆలయంలో పూజలు

బీబీపేట, జూన్ 28: మండలకేంద్రంలోని ఊరడమ్మ ఆలయంలో ద్వితీయ వార్షికోత్సవం పురస్కరించుకుని శుక్రవారం ఆలయాన్ని పువ్వులతో, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వాహించడం జరిగింది. ఆలయంలో అభిషేకం, యజ్ఞాలు, కలశపూజ, తీర్థ ప్రసాదవితరణ వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



యూనిఫాంలకు సంబంధించిన సామగ్రి

రెండోజత యూనిఫాంలు అందజేస్తాం : ఏపీఎం

బీర్కూర్, జూన్ 28: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఇప్పటికే ఒక జత యూనిఫాంలు అందజేశామని, త్వరలో మరో జత అందజేస్తామని ఐకేపీ ఏపీఎం గంగాధర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన యూనిఫాంలు కుట్టడానికి వచ్చిన సామగ్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రెండో జత యూనిఫాంలు అందించేందుకోసం రెండోవిడత సామగ్రి వచ్చిందన్నారు. అయితే ఆ సామగ్రిని గ్రామాల వారీగా టైలర్‌లకు అందజే స్తున్నామని తెలిపారు. త్వరలో విద్యార్థులకు రెండోజత దుస్తులు అందజేస్తామన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

రాజంపేట, జూన్ 28 : రాజంపేట మండల కేంద్రంలో జోగిపేట్ రంజిత్ (25) అనే యువకుడు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ సంపత్ తెలిపారు. కొంతకాలంగా మతిస్థిమితం లేక పనులు చేయకుండా ఇంట్లోనే ఉండేవాడని, తరచూ ఇంట్లో గొడవలు పడుతుండడంతో తల్లిదండ్రులు గ్రామంలోని వేరే ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారని తెలిపారు. గురువారం మధ్యాహ్నం ఇంట్లోకి వెళ్లి గడియ పెటుకున్నాడని, రాత్రి అయినా గడియ తీయకపోవడంతో స్థానికుల సహాయంతో డోర్ తీసిచూడగా దూలానికి ఉరివేసుకుని కనిపించాడన్నారు. కిందికి దింపి చూడగా అప్పటికే మృతిచెందినట్లు కుటుంబసభ్యులు చెప్పారన్నారు. మృతుని తండ్రి బాల్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అమ్మ ఆదర్శ పాఠశాలను సందర్శించిన డీపీవో

మద్నూర్, జూన్ 28 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శపాఠశాలను జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతులను కల్పించడంతో పాటు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం నాణ్యమైన విద్యతో పాటు మంచి మౌలిక సదుపాయాలను కల్పించడంపై ప్రత్యేకదృష్టి సారించి విద్యారంగానికి అధిక ప్రాధాన్యత నిస్తుందన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక మౌలికసదుపాయాలకు సంబంధించిన పనులను అమలు చేయడానికి, పర్యవేక్షించడానికి బలోపేతం చేయడానికి నిర్వహించడానికి పాఠశాల యూనిఫాంలు, మధ్యాహ్నభోజనం వంటి విద్యార్థుల ప్రయోజనాలను అందించడానికి అలాగే పారిశుధ్య పనులను చేపట్టడానికి మహిళా సంఘాల సామర్థ్యాన్ని ఉపయోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేసిందని గుర్తు చేశారు.



మద్నూర్ అమ్మ ఆదర్శ పాఠశాలను సందర్శించిన మండల ప్రత్యేక అధికారి

ప్రతీఒక్కరు మొక్క నాటాలి

బీర్కూర్, జూన్28: భారతీయ జన్ సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బీజేపీ నాయకులు అమ్మపేరిట ఒక మొక్కనాటుదాం అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నా యకులు బీర్కూర్‌లో ఇంటింటికి తిరు గుతూ (ఏక్ పేడ్ - మాకా నామ్) అమ్మ పేరిట ఒక మొక్క నాటుదామని ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ మొక్కలు పంపిణీ చేశారు.

విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రం ఆటలు

● విద్యార్థి సంఘాల ఆరోపణ



నోటికి నల్లబట్ట కట్టుకుని నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

కామారెడ్డిటౌన్, జూన్ 28: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీని విధిస్తుందని విద్యార్థి సంఘ నాయకులు ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నోటికి నల్లబట్ట కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రభుత్వం విద్యార్థులు, యువకుల పట్ల అప్రకటిత ఎమర్జెన్సీని విధిస్తున్నట్లుగా పశ్నించే వారిని నిర్బంధిస్తు లాఠీచార్జిలు చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టి విద్యను వ్యాపారంచేసి అంగట్లో సరకులాగా 30 లక్షల నుంచి 50లక్షల వరకు నీట్, నెట్ పేపర్లని అమ్ముకునే విధానం చూస్తే పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలను ఆదాయ వనరులుగా బీజేపీ ప్రభుత్వం చూస్తుందనేది అర్థమవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సందీప్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్, బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్, భరత్, ప్రసన్న, బుల్లెట్, సుఫీయన్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం

● ఏఎస్పీ నరసింహారెడ్డి

కామారెడ్డిటౌన్, జూన్ 28:నూతన చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఏఎస్పీ నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసినసమావేశంలో ఆయన మాట్లాడుతూ జూలై ఒకటో తేది నుంచి అమలులోకి రానున్న నూతనచట్టాల పట్ల ప్రతి ఒక్కపోలీసు అధికారి,సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపార. కొత్త చట్టాలను అనుసరిస్తు ముందుకు సాగాలని తెలిపారు. కొత్తచట్టాలైన భారతీయ న్యాయసంహిత,భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియంపై పూర్తి అవగాహన కలిగి ఉన్నప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వహించగలమని, కొత్త చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన రావాలంటే ప్రతి ఒక్కరిలో నేర్చుకోవాలనే తపన ఉన్నప్పుడే సాధ్యం అవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ మదన్‌లాల్, ఎస్ఐలు,సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ నరసింహారెడ్డి

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	ఓసీ
దర్శన్	మహారాజ
ప్రియా 70	ఓఎంజీ

బాన్సువాడ	
మహేశ్వరి	కల్కి
వెంకటేశ్వర	నింద

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	160	200	220
వెన్‌కాబ్(కిలో)	170	220	230